ప్రజాశక్తి
బుధవారం 24 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం

పార్వతీపురం మన్యం

సిద్ధం సభకు హాజరైన జనం

నన్ను ఓడించడానికి మూడు తోడేళ్లు

సిద్ధం సభలో మాట్లాడుతున్న సిఎం జగన్

- చంద్రబాబు హయాంలో అన్నీ స్కాములే
- ప్రస్తుత ఎన్నికలు ప్రతి ఇంటి భవిష్యత్తు
- సిద్ధం సభలో వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

'తనను ఓడించడానికి ఒకరు కాదు.. ఇద్దరు కాదు... టిడిపి, జనసేన, బిజెపి వంటి మూడు తోడేళ్లు కూటమిగా ఏర్పడ్డాయి' అని వైసిపి అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. వీరికి పలు పత్రికలు, టీవీ ఛానళ్లు తోడయ్యాయని విమర్శించారు. చంద్రబాబు వెనకాల ఓ కాంగ్రెస్ కూడా ఉందన్నారు. కుట్రలు, మోసాలు, అబద్ధాలు ప్రచారం చేయడానికి పెత్తందారు ముఠాలున్నాయని అన్నారు. నా ఒక్కడి మీదకు ఇంతమంది ఏకం అవుతున్నారని అన్నారు. జగన్ కనుక ఇంటింటికి మంచి చేయకపోయి ఉంటే ఇంతమంది తోడేళ్లు ఏకం కావాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. మంగళవారం విజయనగరంలోని చెల్లూరు వద్ద నిర్వహించిన సిద్ధం సభలో ఆయన మాట్లాడారు. గడిచిన 58 నెలల తన పాలనలో ప్రతివారికీ మేలు చేశామని అన్నారు. పేదల కలల్ని, బతుకుల్ని బలిపెట్టేందుకే చంద్రబాబు చంద్రముఖిగా మారి ఏర్పాటు చేసిందే ఈ రాజకీయ కూటమే అని విమర్శించారు. చంద్రబాబు హయాంలో పేదలకు స్కీములేవీ పెట్టలేదని, ప్రభుత్వ ధనం దోచుకునే స్కామ్‌లు మాత్రమే పెట్టారని విమర్శించారు. ఇంటింటి అభివృద్ధిని కొనసాగించాలన్న పోరాటం తాము చేస్తుంటే, పేదలను ఓడించాలన్న ఆరాటంతో కూటమి పార్టీలు పనిచేస్తున్నాయని అన్నారు. ప్రస్తుత ఎన్నికలు కేవలం ఎంపిలను, ఎమ్మెల్యేలను (మిగతా..3లో)

గుండెల నిండా ఎర్రజెండా

- ఎరుపెక్కిన కురుపాం
- ఆకట్టుకున్న డప్పు వాయిద్యాలు, కోలాట నృత్యాలు
- కోలాహలంగా సిపిఎం అభ్యర్థి మండంగి రమణ నామినేషన్

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్



సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి

ప్రజాశక్తి - కురుపాం /గుమ్మలక్ష్మీపురం

ఇండియా వేదిక పార్టీలు బలపరిచిన సిపిఎం కురుపాం నియోజకవర్గ అభ్యర్థి మండంగి రమణ గిరిజనులు, వామపక్ష శ్రేణుల కోలాహలం మధ్య మంగళవారం నామినేషన్ వేశారు. తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వివి రమణకు అందజేశారు. అంతకుముందు రావాడ రోడ్డు నుంచి దూళికేశ్వర ఆలయం వరకు సుమారు కిలోమీటరు పొడవున భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుల వాయిద్యం, మహిళల కోలాట నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన గిరిజనులు, దళితులు, కార్మికులు, సిపిఎం, సిపిఐ శ్రేణులు, కాంగ్రెస్ అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ర్యాలీ అగ్రభాగాన అభ్యర్థి మండంగి రమణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, కె.సుబ్బరావమ్మ, నాయకులు పాల్గొన్నారు. వందలాది మందితో నిర్వహించిన ర్యాలీతో కురుపాం వీధులు ఎర్రజెండాలతో ఎరుపెక్కాయి. మరోవైపు ఎండ వేడిమిని తట్టుకొని వృద్ధులు, మహిళలు, చిన్నారులు సిపిఎంపై ఉన్న అభిమానంతో దారి పొడవున నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. అభ్యర్థి మండంగి రమణ దారి పొడవున ప్రజలకు, బస్సుల్లో ఆటోలో వస్తున్న ప్రయాణకులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మహిళలు, పారిశుధ్య కార్మికులు, మోటార్ యూనియన్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మద్దతు ఇచ్చారు.

అనంతరం సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ సభ్యులు కోలక అవినాష్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన (మిగతా..3లో)

సయోధ్య కుదిరింది

- ఎట్టకేలకు కలిసిన బాబాయ్.. అబ్బాయ్
- కె.ఎ.నాయుడు భవిష్యత్తు చూసుకుంటామని చంద్రబాబు హామీ
- గజపతినగరం టిడిపి శ్రేణుల్లో జోష్



సభలో కె.ఎ.నాయుడు, శ్రీనివాస్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గజపతినగరం నియోజకవర్గంలో బాబాయ్... అబ్బాయ్... ఎట్టకేలకు కలిశారు. ఒకరికొకరు కరచాలనం చేసుకున్నారు. చంద్రబాబు సభలో పక్కపక్కనే కూర్చొన్నారు. కెఎ నాయుడు మరో అడుగు ముందుకు వేసి విజయం మనదే అన్నట్టుగా చేతి వేళ్లతో సభలో సంకేతాలు తెలియజేశారు. బాబాయ్ కలయికతో విజయం తథ్యమంటూ గజపతినగరం అసెంబ్లీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. కెఎ నాయుడు రాజకీయ భవిష్యత్తు టిడిపి చూసుకుంటుందని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. దీంతో, గజపతినగరం టిడిపి శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. గజపతినగరంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు టిక్కెట్ ఆశించి భంగపడిన సంగతి తెలిసిందే. తొలి జాబితాలోనే ఆయన అన్నయ్య కొండబాబు కుమారుడు శ్రీనివాస్‌కు అధిష్టానం టిక్కెట్ ఖరారు చేసింది. దీంతో, తీవ్ర మనస్థాపానికి గురైన నాయుడు అటు పార్టీపైనా, ఇటు శ్రీనివాస్‌పైనా అలకబూనారు. ఈనేపథ్యంలో సుమారు 35రోజులపాటు పార్టీలో అంతర్గత పోరాటం చేశారు. పలు మార్లు చంద్రబాబును కలిశారు. పున:పరిశీలనలో (మిగతా..3లో)

మహిళలకు పుట్టినిల్లు టిడిపి

- ల్యాండ్ టైటిల్ యాక్టుతో జగన్ భూములు దోచుకుంటున్నారు
- సూపర్ సిక్స్ ద్వారా ప్రజా సంక్షేమం : చంద్రబాబు

సభలో మాట్లాడుతున్న టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి - గజపతినగరం

మహిళలకు టిడిపి పుట్టినిల్లు వంటిదని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్టుతో సిఎం జగన్ పేదల భూములు దోచుకుంటున్నారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి రాగానే జగన్ అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజా సంక్షేమానికి, ముఖ్యంగా మహిళాభివృద్ధి పెద్దపీట వేస్తామని అన్నారు. గజపతినగరం నియోజకవర్గం బొండపల్లిలో నిర్వహించిన మహిళా ప్రజాగళం సభలో చంద్రబాబు మాట్లాడారు. కీర్తి శేషులు ఎన్‌టిఆర్ హయాంలో ఆస్తిలో ఆడబిడ్డకు సమాన హక్కు కల్పించారని గుర్తు చేశారు. మహిళలు రాజకీయాల్లోకి వచ్చే విధంగా ప్రోత్సహించారని అన్నారు. తాను అధికారంలోకి వచ్చాక డ్వాక్రా సంఘాలను ప్రోత్సహించి, ఆర్థికంగా, రాజకీయంగా ప్రోత్సహించానని అన్నారు. ఇళ్ల స్థలాలు, రైతు బజారు, ఇసుక ర్యాంపులు కూడా డ్వాక్రా అక్కచెల్లెళ్లకు ఇచ్చామని అన్నారు. ఆడబిడ్డను తల్లిదండ్రులు భారంగా భావించే పరిస్థితి లేకుండా ఆ బిడ్డ పేరుమీద రూ.5వేలు ఫిక్స్ డిపాజిట్ చేసి పెళ్లీడు సమయంలో (మిగతా..3లో)

సభకు హాజరైన మహిళలు, టిడిపి శ్రేణులు

బస్సుల తరలింపుతో అవస్థలు

• సిఎం సభకు 1050 బస్సుల తరలింపు •గంటల కొద్దీ నిరీక్షించినా తప్పని కాలినడక •విద్యార్థులకూ అవే కష్టాలు

ప్రజాశక్తి - విజయనగరం కోట, వేపాడ, రేగిడి

జిల్లాలోని విజయనగరం మండలం చెల్లూరు కేంద్రంగా మంగళవారం సిఎం జగన్మోహన్‌రెడ్డి సిద్ధం సభ నిర్వహించడంతో ఆర్‌టిసి బస్సులను అక్కడికి పెద్ద ఎత్తున తరలించేశారు. దీంతో సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు, పెళ్లిళ్లకు వెళ్లాల్సిన బంధువులు, ఆస్పత్రికి వెళ్లాల్సిన రోగులు నానా తంటాలు పడ్డారు. డిపోల్లో బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షించినా ఫలితం లేకపోవడంతో కాలినడక వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ముఖ్యంగా విద్యాసంస్థలకు సెలవులు కావడంతో చాలా మంది పిల్లలు తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు ఆర్‌టిసి కాంప్లెక్స్‌లకు వెళ్లినా బస్సులు లేకపోవడంతో అవస్థలు పడ్డారు. కొంత మంది ఆటోలు, జీపులను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇంతటి ఎండలో సకాలంలో బస్సులు లేక ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. అరగంటకో గంటకో ఒక బస్సు రావడంతో ఒకేసారి ప్రయాణికులు బస్సు ఎక్కేందుకు ఎగబడి ఇబ్బందులు పడ్డారు.

విజయనగరంలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

విజయనగరం, శ్రీకాకుళం జిల్లా కేంద్రాల నుంచి పాలకొండ, రాజాం రావాల్సి బస్సులు సకాలంలో రాకపోవడంతో రాజాం బస్సుడిపో వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం నుంచి బడులకు వేసవి సెలవులు ఇవ్వడంతో గురుకుల పాఠశాల విద్యార్థులు, కస్తూర్బా గాంధీ విద్యార్థులు, హాస్టల్ విద్యార్థులు తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు పెద్ద ఎత్తున డిపోలకు చేరుకున్నా అక్కడ బస్సులు లేకపోవడంతో తంటాలు పడ్డారు.

విజయనగరం జోన్ పరిధిలోని 1080 బస్సులను సిఎం సభకు తరలించారు. విజయనగరం డిపో నుంచి విశాఖపట్నం, గాజువాక, మద్దిలపాలెం, శృంగవరపుకోట, సాలూరు, పార్వతీపురం ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు వెళ్లకపోవడంతో విజయనగరం డిపోకు వచ్చిన ప్రయాణికులు అవస్థలు పడ్డారు. చాలా మంది బస్సులు కోసం నిరీక్షించి రాకపోవడంతో ప్రయాణాలను

బస్సులు లేకపోవడంతో బోసుపోయిన విజయనగరం కాంప్లెక్స్

రద్దు చేసుకుని వెనుదిరిగారు.

వేపాడ మండలంలో బక్కునాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాల, కెజిబివి వసతి గృహం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో చదువుతున్న సుమారు 2వేల మంది విద్యార్థులకు మంగళవారం నుంచి సెలవులిచ్చిన విషయం తెలిసిందే. అయితే సిఎం సభ కారణంగా శృంగవరపుకోట డిపోలో ఉన్న సుమారు అన్ని బస్సులనూ సిఎం సభకు తరలించడంతో గ్రామాల్లోకి రావాల్సిన బస్సులు రాలేదు. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు ఆర్‌టిసిలు కోసం ఎదురు చూసి ఇబ్బందులు పడ్డారు. చాలా మంది విద్యార్థులు చేత బ్యాగు పట్టుకుని మండుటెండల్లో నడిచి వెళ్లాల్సి పరిస్థితి దాపురించింది.

బైక్ ర్యాలీగా వెళుతున్న శివారెడ్డి, తదితరులు

సిద్ధం సభకు మద్దతుగా బైక్ ర్యాలీ

భోగాపురం : చెల్లూరులో జరిగిన జగన్ సిద్ధం సభకు మద్దతుగా రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని వివిధ పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహారాజుపేట సమీపంలోని అమలోద్భవి హోటల్ నుంచి బైక్ ర్యాలీ చెల్లూరు సిద్ధం సభ వరకు నిర్వహించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డిని స్వాగతం పలికేందుకు భారీ బైక్ ర్యాలీ ఏర్పాటు చేస్తారని అన్నారు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని మహిళలంతా కోరు కుంటున్నట్లు ఆయన తెలిపారు. మండల వైసిపి అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త.. కమిషనర్ ఆగ్రహం

బొబ్బిలి: కోటి చెరువు గట్టు వద్ద రోడ్డు పక్కన చెత్త ఉండడంతో కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటి చెరువు, ఆర్‌టిసి కాంప్లెక్స్, మల్లమ్మపేట ప్రాంతాల్లో మంగళవారం పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు పక్కన చెత్త వేస్తే గుర్తించి జరిమానా విధించాలన్నారు. కోటి చెరువు రోడ్డు వద్ద చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని, కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆమెతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, తదితరులు ఉన్నారు.

మరిడిమాంబ ఆలయ ప్రతిష్ట

వేపాడ: మండలంలోని అంకాజోస్యులపాలెం గ్రామంలో మంగళవారం మరిడి మాంబ ఆలయ ప్రతిష్ట నిర్వహించారు. ప్రతిష్ట సందర్భంగా బుధవారం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బి.శ్రీను తెలిపారు. మహిళల కోలాటం ఏర్పాటుచేసినట్లు చెప్పారు.

నిరసన తెలుపుతున్న మారిక గిరిజనులు

పవర్‌ప్లాంట్ మాకొద్దు

వేపాడ : తమ గ్రామ పరిధిలో పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయొద్దని మారిక సర్పంచ్ పి.పెంటమ్మ ఆధ్వర్యాన గిరిజనులు మంగళవారం ఎస్.కోటలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ గ్రామంలో సర్వే కోసం సిబ్బంది రాగా, వారిని గిరిజనులు అడ్డుకున్నారు. పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు సర్వే చేయొద్దని కోరారు. గతంలో తమ భూమిని సర్వే చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇస్తామని నమ్మించి, సుమారు 60 ఎకరాలను ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేశారని తెలిపారు. తమ భూమిని వ్యాపారులు నానోలైబెడ్ కంపెనీ పేరిట మ్యుటేషన్ చేశారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

డిటి వివరణ

ఈ విషయాన్ని డిప్యూటీ తహశీల్దార్ సన్యాసి నాయుడు దృష్టికి తీసుకెళ్లగా, మారిక, లీలవల్లి, కెజపూడి పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో ప్రభుత్వ భూములను సర్వే చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనులకు ప్రయోజనం కలిగేలా సర్వే చేస్తున్నట్లు వివరించారు.

పాఠశాలల సందర్శన

వేపాడ: మండలంలోని నీలకంఠరాజుపురం, పెదగుడిపాల ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఎంఇఒ బి.బాలభాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తెలుగు , ఇంగ్లీష్ చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలపై సామర్థ్యాన్ని పరిశీలించారు. వేసవిలో విద్యార్థులు ఎండలో తిరగకుండా చక్కగా ఇంటి దగ్గర చదువు కోవాలని సూచించారు.

పరిమళించిన మానవత్వం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎవరైనా బాధల్లో ఉన్నారంటే చాలు ఆయన వెంటనే పెద్దమనసు చేసుకొని స్పందిస్తారు. బాధితులు, అన్నార్తుల బాధలు, వారి కష్టాలు ఏమిటో తెలుసుకుంటారు. అందులో కులం, మతం, ప్రాంతం వంటివేమీ చూడకుండా వారిని మానవతతో సాకి ఆపన్న హస్తం అందిస్తారు. నేనున్నానంటూ కొండంత భరోసాను, ధైర్యాన్ని ఇస్తారు. ఆయనే కారుణ్య ఫౌండేషన్ చైర్మన్, రోటరీ క్లబ్ బొబ్బిలి అధ్యక్షులు జెసి రాజు. సామాజిక సేవా రంగంలో ఆయనకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆ విషయం మరోమారు నిరూపితమైంది.

నగదు అందజేస్తున్న జెసి రాజు

బొబ్బిలి పట్టణంలోని తారకరామా కాలనీకి చెందిన పిరిడి రాంబాబు గతంలో జ్యూట్ పరిశ్రమలో పనిచేసి, ఉపాధి కోల్పోయాడు. పక్షవాతం బారిన పడి నరకయాతన అనుభవిస్తున్నాడు. సంపాదన లేదు. వైద్యం అందక, మందులు కొనే స్తోమత లేక, సరైన పోషణ లభించక.. అద్దె ఇంట్లో ఉంటూ సాయాన్ని అందించే వారి కోసం ఎదురు చూస్తున్నాడు. రాంబాబుకు మంచి వైద్యం అందితే ఆయన మామూలు మనిషి కాగలరని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. రాంబాబు గురించి సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర రావు ద్వారా జెసి రాజు తెలుసుకున్నారు. తక్షణమే స్పందించిన ఆయన మందుల కోసం రూ.5 వేలు నగదు, మరో రూ.5 వేల నిత్యావసర సరుకులు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. బాధితునికి చికిత్స నిమిత్తం వైద్యులను సంప్రదిస్తున్నామని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. జెసి రాజుకు ఆ కుటుంబ సభ్యులతోపాటు శంకరరావు కృతజ్ఞతలు తెలిపారు.

జనసేనలోకి బొడ్డవలస వైసిపి నాయకులు

ప్రజాశక్తి - భోగాపురం

డెంకాడ మండలం బొడ్డవలస గ్రామానికి చెందిన వైసిపి నాయకులు జనసేన పార్టీలో మంగళవారం చేరారు. ముంజేరు పార్టీ క్యాంప్ కార్యాలయంలో లోకం మాధవి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైకాపాకు చెందిన కోన రామకృష్ణ, ఎద్దు పైడిరాజు, ఎర్ర చంద్రరావు, సుంకరి మహేష్ తదితరులు పార్టీలో చేరారు. కోన రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి గ్రామ ఎటువంటి అభివృద్ధికీ నోచుకోలేదన్నారు. లోకం మాధవి ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో పార్టీలో చేరామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవన్ ఆశయాలు నచ్చి పార్టీలో చేరుతున్నారన్నారు.

మరో నామినేషన్ వేసిన బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన మంగళవారం మరో నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం బేబినాయన రెండు సెట్ల నామినేషన్లు వేశారు. మూడో నామినేషన్ సెట్‌ను ఆర్‌డిఒ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిశ్రీకి అందజేశారు. ఇప్పటి వరకు బొబ్బిలి నుంచి 14 నామినేషన్లు పడ్డాయి.

బేబినాయనకు బి-ఫారం అందిస్తున్న చంద్రబాబు

బి-ఫారం అందజేత ... టిడిపి అభ్యర్థిగా బేబినాయన ఆ పార్టీ అధినేత చంద్రబాబు నుంచి బి-ఫారం అందుకున్నారు. మంగళవారం బొండపల్లి సభకు వచ్చిన చంద్రబాబును బేబినాయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు చంద్రబాబు బి-ఫారం అందజేశారు. బొబ్బిలి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజాను చంద్రబాబు కోరారు.

చిన్నారులతో ముచ్చట.. మున్సిపాలిటీలోని రామన్నదొరవలసలో మంగళవారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన వద్దకు చిన్నారులు రావడంతో వారిని ఎత్తుకుని కాసేపు ముచ్చటించారు. బాగా చదువుకుని మంచి ప్రయోజకులు కావాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్ కె.లక్ష్మి, నాయకులు కె.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రాజవర్ధన్ నామినేషన్

రేగిడి: రాజాం తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి జోసెఫ్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల రాజవర్ధన్ మంగళవారం నామినేషన్ అందజేశారు. నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలతో పాటు సిపిఐ నాయకులు ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, సిపిఎం నాయకులు రాజాం ప్రధాన రహదారి మీదుగా ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సంతోషాన్నిచ్చాయి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

తమ పాఠశాలకు ఉత్తమ ఫలితాలు రావడం సంతోషంగా ఉందని పూసపాటిరేగ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.శంకరరావు అన్నారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో 576 మార్కులు సాధించిన కెళ్ల కావ్యశ్రీతోపాటు 567 మార్కులు సాధించిన అవినతవ కుమార్, 561 మార్కులు సాధించిన ఆర్. యశ్వంత్‌ను అభినందించి మిఠాయిలు తినిపించారు. పాఠశాల ఏర్పాటైన తరువాత మొదటి సారిగా పది ఫలితాల్లో 576 మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. 80శాతం ఉత్తీర్ణత సాధించడానికి సహకరించిన ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మ్యాథ్స్, సైన్స్‌లో 100కి 100 మార్కులు సాధించడం మంచి పరిణామమని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మార్కులు రావడంతో గ్రామపెద్దలు, గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులును అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉత్తీర్ణత తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొవ్వాడ సర్పంచ్ రఘు దాతృత్వం

పూసపాటిరేగ : గ్రామంలో తాగునీటి ఎద్దడిని తెలుసుకొని గ్రామస్తుల దాహాన్ని తీర్చేందుకు సొంత నిధులు వెచ్చిస్తున్న కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు దాతృత్వాన్ని గ్రామస్తులతో పాటు తెలిసిన వారంతా అభినందిస్తున్నారు. వారం రోజులు క్రితం రూ.1.50 లక్షల సొంత నిధులతో శుద్ధజల ప్లాంట్ మరమత్తులు చేయించి శుద్ధ జలాలను గ్రామస్తులకు అందించిన ఆయన మంగళవారం తాజాగా మరో రూ. లక్ష సొంత నిధులతో బోరుకు మోటారు బిగించి గ్రామస్తులకు మంచినీరు అందించే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పుష్కలంగా నీరు అందించాలన్న ఉద్దేశంతోనే సొంత నిధులు వెచ్చిస్తున్నానన్నారు. గ్రామస్తులంతా తన మీద నమ్మకంతో సర్పంచ్‌గా తనను ఎంపిక చేసుకున్నారన్నారు. వారి నమ్మకాలను నిలబెట్టుకోవడమే తన ధ్యేయమని అన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం నిధులు ఇవ్వ లేకపోతుందని అందుకే తన సొంత నిధులు ఖర్చు చేస్తున్నానని చెప్పారు.

మొదటిపేజీ తరువాయి

గుండెల నిండా ఎర్రజెండా

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి ప్రసంగించారు. రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు అంబానీ, ఆదాని వంటి కార్పొరేట్ వ్యక్తులతో చేతులు కలిపి పరిశ్రమల పేరుతో గిరిజనులను అడవి నుంచి దూరం చేసే కుట్ర జరుగుతుందన్నారు. గిరిజన సంఘం, సిపిఎం పోరాటాల ఫలితంగానే 1/70 చట్టం, అటవీ హక్కులు చట్టం, పిసా చట్టం, ఉపాధి హామీ చట్టం సాధించుకున్నామని అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక ఈ చట్టాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. జిఒ నెంబర్ 3 ఎత్తివేయడంతో గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయన్నారు. ఇండియా కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన మండంగి రమణ, అప్పల నర్సను గెలిపించి చట్టసభలకు పంపించిన నాడే గిరిజన జీవనానికి రక్షణగా ఉంటుందని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసిదాస్ మాట్లాడుతూ సిపిఎం పోరాట ఫలితంగా ఏజెన్సీలో అనేక సమస్యలను పరిష్కరించుకో గలిగామన్నారు. పేదలు కార్మికులు గిరిజనులు దళితుల పక్షాన ఉండి పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులకు మద్దతు ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని అన్నారు. ఈ కారణంగానే ధరలు పెరుగుదల, నిరుద్యోగం వెంటాడుతున్నాయని అన్నారు.

సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ సిపిఎం పోరాట ఫలితంగా గుమ్మలక్ష్మీపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పూర్ణపాడు లాబేసు వంతెన మంజూరు అయిందన్నారు. డిగ్రీ కళాశాల పూర్తయినా, పూర్ణ పాడు లాబేసు వంతెన పనులు నిలిచిపోయాయని తెలిపారు. టిడిపి, వైసిపి పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం తప్ప వంతెనను పూర్తిచేసే ఆలోచన లేకపోవడం దుర్మార్గపు పాలనకు నిదర్శనం అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి రమణను గెలిపిస్తే ఏడాది లోపు వంతెన పూర్తి చేసి చూపిస్తామని ఈ సందర్భంగా గిరిజనులకు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ మాట్లాడుతూ తనను ఆశీర్వదించాలని గిరిజనుల సమస్యలన్నిటినీ పరిష్కరిస్తానని అన్నారు. గత 15 ఏళ్లగా కురుపాం నియోజకవర్గంలో ఏనుగులను తరలించే చర్యలు చేపట్టడంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పల నరసయ్య మాట్లాడుతూ బాక్సైట్ తవ్వకాల పేరుతో అడవి నుంచి దూరం చేసే కుట్ర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయని అన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు చట్టాలను కాపాడుకోవాలంటే రానున్న ఎన్నికల్లో ఎంపీగా గెలిపించి చట్ట సభలకు పంపించాలని కోరారు. కాంగ్రెస్ డిసిసి ఉపాధ్యక్షులు డి.శంకర్రావు మాట్లాడుతూ యుపిఎ హయాంలో అనేక విషయాలపై ఉమ్మడిగా సాధించామని, మళ్లీ ఇండియా వేదికను గెలిపిస్తే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్లో ప్రజా సమస్యలపై గళం వినిపించాలంటే ఎర్రజెండా అభ్యర్థులను గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు, నాయకులు కొల్లి గంగు నాయుడు, వై.మన్మధరావు, వి.ఇందిర, మండంగి శ్రీను, కోరంగి సీతారాం, కొల్లి సాంబమూర్తి, బి.వెంకటరమణ, సిపిఐ, కాంగ్రెస్ కార్యకర్తలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

నన్ను ఓడించడానికి మూడు తోడేళ్లు

ఎన్నుకోవడానికే మాత్రమే కాదని, తమకు అందుతున్న పథకాలను, ఇంటికే వచ్చే పౌర సేవలను, వాటి భవిష్యత్‌ను, పిల్లల భవిష్యత్‌ను, రాబోయే ఐదేళ్ల కాపాడుకోవడానికి జరిగేవిగా గుర్తించాలని అన్నారు. వైసిపి ప్రభుత్వ అవసరాన్ని గుర్తించిన ప్రజలు, అద్భుతగులుతున్న పెత్తందార్లుకు, ఆ కౌరవ సైన్యం, ఆ నారా సైన్యానికి బుద్ధి చెప్పటానికి సిద్ధం.. సిద్ధం... సిద్ధం.... అంటూ అడుగులు వేస్తున్నారని అన్నారు. విజయనగరం సిద్ధం సభ ఒక మహా సముద్రాన్ని గుర్తుచేస్తోందన్నారు. ఒక్కసారిగా లక్షల మంది తాండ్ర పాపారాయుళ్ళ, శత్రుసైన్యాన్ని ఓడించేందుకు సిద్ధమైనట్టుగా అనిపిస్తోందన్నారు. సభలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆయన సతీమణి విశాఖ ఎంపి అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులు కోలగట్ల వీరభద్రస్వామి, బడుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, శంబంగి చినవెంకటప్పలనాయుడు, గొర్లె కిరణ్‌కుమార్, తలే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేసిన జగన్

పూసపాటిరేగ : వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన సిద్ధం బస్సుయాత్ర మంగళవారం రాత్రి పూసపాటిరేగ చేరుకుంది. మండలంలోని కొప్పెర్ల జాతీయ రహదారి వద్ద వచ్చిన జగన్ ప్రజలకు అభివాదం చేశారు. మండలంలోని వేలాదిగా కార్యకర్తలు నాయకులు అభిమానులు తరలివచ్చారు. బస్సు పై జగన్ తో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, నాయకులు కందుల రఘుబాబు తదితరులు ఉన్నారు. మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు ఎంపిపి మహంతి కళ్యాణి, జెడ్‌పిటిసి సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, నాయకులు మహంతి జనార్ధన్ రావు, పుప్పాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

సయోధ్య కుదిరింది

భాగంగా తనకు అవకాశం వస్తుందని కూడా ఆశించారు. దీంతో, నాయుడు ముఖ్య అనుచరులు ప్రచారంలో శ్రీనివాస్ వెంట వెళ్లలేదు. నామినేషన్ల పర్వం ముగింపుదశకు రావడం, ఇటీవల జరిగిన మార్పులు, చేర్పుల్లో కూడా నాయుడుకు అవకాశం లేకపోవడంతో ఒకింత ఢీలాపడ్డారు. తొలి నుంచీ శ్రీనివాస్‌కు సహకరించే పరిస్థితి లేదంటూ ఎంపీ, ఎమ్మెల్యేలు తెల్చిచెప్పడం, అందుకు తగ్గట్టే తన అనుచరులు కూడా ప్రచారానికి వెళ్లకపోవడంతో ఎన్నికల్లో టిడిపి గట్టెక్కడ కష్టమేనంటూ పలువురి నోట విశ్లేషణలు, ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. నాయుడు వ్యవహార శైలికూడా ఇందుకనుగుణంగానే రక్తి కట్టించింది. ఎట్టకేలకు జిల్లా పర్యటనలో చంద్రబాబు భాగంగా మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ద్వారా పిలిపించారు. గంటా సమక్షంలో మంగళవారం ఉదయం ఎస్.కోటలో నాయుడుతో చంద్రబాబు చర్చించారు. ఎన్నికల్లో జిల్లా ప్రచార కో-ఆర్డినేటర్గా పనిచేయాలని సూచించినట్టుగా సమాచారం. ఇదే విషయాన్ని అక్కడి నుంచే నేరుగా రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడికి కూడా తెలియజేసి, ఇందుకనుగుణంగా లిఖితపూర్వక ఆదేశాలు పంపాలని సూచించినట్టుగా సమాచారం. ఎన్నికల అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షునిగా నియమిస్తామని కూడా చెప్పారట. ఆ తరువాత అవకాశాన్ని బట్టి ఎమ్మెల్సీ లేదా రాజ్యాంగ బద్ధమైన పదవి కూడా కట్టబెడతామని కూడా హామీ ఇచ్చినట్టుగా తెలిసింది. ఈనేపథ్యంలో ఎట్టకేలకు అలకవీడిన నాయుడు ఎస్.కోట నుంచి నేరుగా బొండపల్లిలోని సభావేదిక వద్దకు తన అనుచరులతో కలిసి వచ్చారు. ఎట్టకేలకు కెఎ నాయుడు, శ్రీనివాస్ (బాబాయ్... అబ్బాయ్...) ఒకే వేదికపైకి రావడంతో పార్టీ మొత్తం ఎన్నికల్లో కలిసికట్టుగానే పనిచేస్తుందన్న సంకేతాలు ఇచ్చారు. చంద్రబాబు కూడా సభలో నాయుడు రాజకీయ భవిష్యత్తుపై భరోసా ఇచ్చారు. శ్రీనివాస్ గెలుపునకు నాయుడు సహకారం, నాయుడికి చంద్రబాబు ఇచ్చిన హామీలు ఆచరణలో ఎలా ఉంటాయో వేచిచూడాల్సిందే.

కౌంటింగ్ వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఓట్ల లెక్కింపు కేంద్రాలవద్ద స్ట్రాంగ్ రూమ్‌లను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. స్ట్రాంగ్ రూములు, లెక్కింపు కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్లలో ఏర్పాటుపై నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జెఎన్‌టియుజివి, లెండి కళాశాలల్లో ఏర్పాటు చేయనున్నస్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్లు, ఫుడ్ కోర్టులు, పార్కింగ్ ప్రాంతం, లోపలికి రాకపోకలు మార్గాలు తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నిక ప్రక్రియ ముగించి ఎంతో అలసిపోయి వచ్చే సిబ్బంది ఏమాత్రం ఇబ్బంది పడని విధంగా రిసెప్షన్ సెంటర్ వద్ద ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది సాయంత్రం 7 గంటల నుంచి రిసెప్షన్ సెంటర్‌కు చేరుకొనే అవకాశం ఉందని, అప్పటికే అక్కడ అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జెసి కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ అనిత, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పోక్సో నిందితుడికి ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

దిశ మహిళా పోలీసు స్టేషన్‌లో 2021 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి ఏడేళ్లజైలు శిక్ష విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె. నాగమణి సోమవారం తీర్పు చెప్పారని డిఎస్‌పి డి.విశ్వనాథ్ తెలిపారు. పూసపాటిరేగ మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన గొర్లె రాంబాబు (27)కు 2021 జులై 5న ఒక ఇంటిలోకి చొరబడి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లుగా దిశ మహిళా పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. అప్పటి మహిళా ఎస్ఐ కెటిఆర్ లక్ష్మి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారు. నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని డిఎస్‌పి తెలిపారు.

చంద్రబాబును కలిసిన వీరేష్ చంద్రదేవ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును కురుపాం నియోజకవర్గ నాయకులు వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్ మంగళ వారం కలిశారు. ఈ మేరకు రానున్న ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో విజయం సాధించేందుకు తీసుకోవల్సిన దిశ నిర్దేశం చేశారు. వీరేష్‌చంద్రదేవ్ చంద్రబాబుకు కురుపాం నియోజకవర్గ సమాచారం.

జాకరవలసలో దాహం కేకలు

సాలూరురూరల్ : మండలంలోని కురుకుట్టి పంచాయతీ జాకరవలసలో గిరిజనులు దాహార్తితో అలమటిస్తున్నారు. గడచిన రెండేళ్లుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం పాడవ్వడంతో దాన్ని బాగు చేయలేదు. బాగు చేయాలని ఎన్నిసార్లు కోరినా ఫలితం లేకపోయింది. దీంతో గిరిజన మహిళలు సమీపంలో ఉన్న సువర్ద ముఖి గెడ్డ నీరే తాగుతున్నారు. గ్రామంలో జలజీవన్ మిషన్ కింద ఇంటింటి కుళాయిలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో గత్యంతరం లేక గిరిజనులు చలమల నీటినే వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ గ్రామంలో నివసిస్తున్న వారంతా గిరిజనులే. వేసవి వచ్చినా అధికారులు గ్రామంలోనిరక్షిత మంచినీటి పథకానికి మరమ్మతులు చేయలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతంలో ప్రభుత్వం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కూడా ఈ సమస్య అధికారుల దృష్టికి రాకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ కార్యక్రమంలో గ్రామాల సమస్యలు చాలావరకు పరిష్కరించామని గొప్పలు చెప్పుకొంటున్న అధికారులు ఈ గిరిజన గ్రామంలో తాగునీటి సమస్యను గుర్తించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో నీటి సమస్యని వెంటనే పరిష్కరించాలని ఏపి గిరిజన సంఘం సభ్యులు మెల్లిక అయోధ్య కోరారు.

మహిళలకు పుట్టినిల్లు టిడిపి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకునే వెసులుబాటు కల్పించిన ఘనత టిడిపిదేనన్నారు. ఆడపిల్లల చదువును ప్రోత్సహిస్తూ తన పాలనలో 8,9,10 తరగతుల విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేశామన్నారు. 33శాతం రిజర్వేషన్లతో రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించామని అన్నారు. భవిష్యత్తులో రాజకీయాల్లో మరింత రిజర్వేషన్ పాటించే విధంగా టిడిపి ముందుకు సాగుతుందన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ఆయన వైఖరి వల్ల తన హయాంలో ఒప్పందం కుదుర్చుకున్న అనేక పరిశ్రమలు వెనక్కిపోయాయని విమర్శించారు. జాబ్ కేలండర్ పేరిట నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. చివరికి నిత్యావసర సరుకులు ధరలు, కరెంట్ బిల్లులు, ఇంటి అద్దెలు, ఆర్టీసీ చార్జీలు కూడా విపరీతంగా పెరిగిపో యాయని తెలిపారు. జగన్ బటన్ నొక్కడం వల్ల ప్రజలకు చేకూరిన లబ్ధికన్నా, ఆయా కుటుంబాలపై చేసిన అప్పులే ఎక్కువన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే సంపద సృష్టించి, పేదలకు, సంక్షేమానికి ఖర్చుచేస్తానని అన్నారు. ఉద్యోగ, ఉపాధి మార్గాలు చూపిస్తానని అన్నారు. కల్తీ మద్యం, గంజాయిలను డోర్ డెలివరీ చేస్తూ ప్రజల ప్రాణాలతో జగన్ చెలగాటమాడుతున్నారని విమర్శించారు. జగన్ పాలనలో మహిళలపై దాడులు, మిస్సింగ్ కేసులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంపదను దోచుకుంటున్న జగన్ భూములను కూడా వదల్లేదని, కొత్తగా అమలు చేస్తున్న ల్యాండ్ టైటిల్ యాక్టుతో ఆన్‌లైన్‌లో మార్పులు చేసి, జనం జీవితాలతో చెలగాట మాడు తున్నాడని విమర్శించారు. ఇటువంటి దోపిడీ వల్ల ఇప్పటికే చాలా కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకుంటున్నాయని అన్నారు. తాము అధికారంలోకి రాగానే ఈ చట్టాన్ని రద్దుచేసి, ప్రజల భూములకు రక్షణ కల్పిస్తామని చెప్పారు.

తనపైనా, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పైనే అక్రమ కేసులు పెట్టిన జగన్‌కు పేదలను ఇబ్బందులకు గురిచేయడం పెద్ద కష్టమేమీ కాదని, అందుకే వైసిపిని ఓడించాలని అన్నారు. అధికారంలోకి వస్తే పోలవరం పూర్తిచేసి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా ఉత్తరాంధ్రకు సాగునీరు అందిస్తామని చెప్పారు. దీనికితోడు పెండింగ్‌లోవున్న ఎంఎం ఛానల్ పూర్తిచేసి గజపతినగరం నియోజక వర్గాన్ని సశ్యశామలం చేస్తామన్నారు. సూపర్ సిక్స్ ద్వారా తల్లికి వందనం పథకంలో భాగంగా ప్రతి విద్యార్థికి రూ.15వేలు చొప్పున ఎంతమంది ఉన్నా అందజేస్తామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని, 18ఏళ్ల నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఇస్తామని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీనికి ముందు విజయనగరం పార్లమెంట్, గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, కొండపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు మాట్లాడారు. సభలో పలువురు మహిళలు తమ సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా, అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి, తెలుగు మహిళ విజయనగరం నగర అధ్యక్షుడు అనురాధాబేగం తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గజపతినగరం సివిలు జడ్జి (జూనియర్ డివిజను) వారి కోర్టులో

I.A. 37/2024 O.S. 32/2023

Between:
దాకారపు అప్పలస్వామి ....వాది
And:
మంత్రి వెంకట అప్పలనాయుడు .....ప్రతివాది
To
మంత్రి వెంకట అప్పలనాయుడు, S/o లేటు అచ్చన్న, 64 సం॥, రిటైర్డు మెయిల్ ఓవర్‌సీరు, పోస్టలు డిపార్టుమెంటు, పురిటిపెంట గ్రామం, గజపతినగరం మండలం, విజయనగరం జిల్లా.

పై దావాలో ప్రతివాది అయిన మీరు కోర్టువారి సమన్లను తప్పించుకొని తిరుగుచున్నందున కోర్టువారి ఉత్తర్వుల మేరకు పత్రికాముఖముగా యీ సమన్లు జారీ చేయడమైనది.

కావున **తే 29-4-2024దీన** పై దావా వాయిదా పడినందున పై తేదీన శ్రీ కోర్టువారి యెదుట పై **తేదీ ఉదయం 10-30 గంటలకు** స్వయంగాగాని, లాయరు గారి ద్వారా గాని హాజరై మీ వాదన దాఖలు చేయవలసినదిగా శ్రీ కోర్టువారు ఆదేశించియున్నారు. అందుకు తప్పిన యెడల పై వ్యాజ్యము మీ పరోక్షములో విచారణ జరిపి తదుపరి ఉత్తర్వులు జారీ చేయబడునని తెలియజేయడమైనది.

శ్రీ కోర్టువారి ఆదేశములతో

బి.శ్రా సూర్యారావు
వాది తరుపు న్యాయవాది, గజపతినగరం

గజపతినగరం
తే 23.4.2024ది

మహారాజశ్రీ గజపతినగరం సివిలు జడ్జి (జూనియర్ డివిజను) వారి కోర్టులో

I.A. 38/2024 O.S. 33/2023

Between:
దాకారపు ఆదిలక్ష్మి ....వాది
And:
మంత్రి వెంకట అప్పలనాయుడు .....ప్రతివాది
To
మంత్రి వెంకట అప్పలనాయుడు, S/o లేటు అచ్చన్న, 64 సం॥, రిటైర్డు మెయిల్ ఓవర్‌సీరు, పోస్టలు డిపార్టుమెంటు, పురిటిపెంట గ్రామం, గజపతినగరం మండలం, విజయనగరం జిల్లా.

పై దావాలో ప్రతివాది అయిన మీరు కోర్టువారి సమన్లను తప్పించుకొని తిరుగుచున్నందున కోర్టువారి ఉత్తర్వుల మేరకు పత్రికాముఖముగా యీ సమన్లు జారీ చేయడమైనది.

కావున **తే 29-4-2024దీన** పై దావా వాయిదా పడినందున పై తేదీన శ్రీ కోర్టువారి యెదుట పై **తేదీ ఉదయం 10-30 గంటలకు** స్వయంగాగాని, లాయరు గారి ద్వారా గాని హాజరై మీ వాదన దాఖలు చేయవలసినదిగా శ్రీ కోర్టువారు ఆదేశించియున్నారు. అందుకు తప్పిన యెడల పై వ్యాజ్యము మీ పరోక్షములో విచారణ జరిపి తదుపరి ఉత్తర్వులు జారీ చేయబడునని తెలియజేయడమైనది.

శ్రీ కోర్టువారి ఆదేశములతో

బి.శ్రా సూర్యారావు
వాది తరుపు న్యాయవాది, గజపతినగరం

గజపతినగరం
తే 23.4.2024ది

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
బుధవారం
24 ఏప్రిల్ 2024

కురుపాంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు

నామినేషన్ సందర్భంగా నిర్వహించిన కురుపాంలో ర్యాలీలో అభివాదం చేస్తున్న సిపిఎం కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ

ఎరుపెక్కిన కురుపాం

ఎమ్‌పి అభ్యర్థి అప్పలనర్సతో కలిసి అభివాదం చేస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పుణ్యవతి

సభలో మాట్లాడుతున్న కె.సుబ్బరావమ్మ, పి.అప్పలనర్స, ఎం.కృష్ణమూర్తి

డప్పుల దరువేస్తున్న గిరిజన కళాకారులు

కోలాటం ఆడుతున్న మహిళలు

దశాబ్దాల పాలనలో తీరని దాహం

దేశానికి స్వాతంత్రం సిద్ధించి 77 ఏళ్లు గడుస్తున్నా పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. ముఖ్యంగా గిరి శిఖర గ్రామాల్లో గిరిజనులు నేటికీ దుర్భర జీవనం గడుపుతున్నారు. తాగడానికి కనీసం స్వచ్ఛమైన నీటి చుక్క లేని దుస్థితి. నీటి కోసం కిలోమీటర్ల దూరం కొండలు దిగి కిందకు వచ్చి దాహార్తి తీర్చుకుంటున్న సందర్భాలు ఏజెన్సీలో నిత్య కృత్యం కనిపిస్తూనే ఉంటాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో చలములు, కొండవాగు ఊటనీరుపై ఆధారపడి కలుషిత నీటిని తాగడంతో వ్యాధులు బారిన పడుతున్నారు. దశాబ్దాల పాటు అధికారం వెలగబెట్టిన పాలకులు ఏజెన్సీలో తాగునీటి కష్టాలను తీర్చలేకపోతు న్నారు. దీంతో గిరిజనులకు ఏటా చలమలే దిక్కవుతున్నాయి. ఫలితంగా మండు వేసవిలో మన్యంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి.

కంబగూడలో చెలమనీరు పడుతున్న మహిళలు

- గిరిజన గ్రామాలను వీడని తాగునీటి కష్టాలు
- చెలమలు, ఊట నీటి కోసం తప్పని కిలోమీటర్ల కాలినడక

గెడ్డనీరు తీసుకొస్తున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గత ఎన్నికల్లో గిరిజనుల కష్టాలు తీరుస్తామని అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం గిరిజన సమస్యలను పట్టించుకోవడం మానేసింది. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా కేవలం ఓట్లు కోసమే వస్తున్నారు తప్ప గిరిజనుల కష్టాలు తెలుసుకొనే పరిస్థితిలో లేకపోవడం బాధాకరం. మన్యం జిల్లాలో పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఎనిమిది సబ్ ప్లాన్ మండలాల్లో 1,503 గిరిజన గ్రామాలు ఉన్నాయి. వీటిలో 4,160 బోర్లు, 745 రక్షిత నీటి పథకాలు, 5 సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాలు, 123 సోలార్ పంపుసెట్లు ఇలా 974 గ్రామాల్లో పూర్తి స్థాయిలో నీటి వనరులున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కానీ వేసవి వచ్చే సరికి వాటి పనితీరు అంతంత మాత్రంగానే ఉంటోంది. ఈ ఏడాది వర్షాలు కురవక ఇప్పటికే గ్రామాల్లో బోర్లు, బావులు పూర్తిగా ఎండిపోయాయి. సోలార్ పంపుసెంట్లు, రక్షిత మంచినీటి పథకాలు పని చేయడం మానేశాయి. బోర్లు కూడా అడుగంటిపోయినవి కొన్నైతే, మరమ్మతులతో మూలకు చేరినవే ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. దీంతో గిరిజనులకు తాగునీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. ఎప్పటిలాగే చలమలు, కొండలోయల్లో ఊటలపైనే ఆధారపడుతున్నారు. ఇప్పటికే నీటికోసం దూర ప్రాంతాలకు కాలినడకన వెళ్లి బిందెలతో మోసుకొస్తున్నారు.

గుమ్మక్ష్మీపురం మండలం జోగిపురం గ్రామం ఏర్పాటై 40 ఏళ్లు గడిచింది. ఇక్కడ 52 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తాగునీటి బోరుల నిర్మాణం జరగలేదు. దీంతో గ్రామంలో ఉన్న ఒకే ఒక బావిపై ఆధారపడుతున్నారు. చప్పగూడ, శిఖర పాయి, వనకాబడి గ్రామాల్లో గిరిజనులు తాగునీటి కోసం అష్ట కష్టాలు పడుతున్నారు. కురుపాం మండలం తోలుంగుడలో 50 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ రెండు బోర్లు తీశారు. అవి పూర్తిగా ఎండిపోవడంతో గ్రామ సమీపాన ఉన్న ఊటనీటి చుట్టూ కుండీ కట్టుకుని అందులో ఊట నీటిని తాగుతున్నారు. వర్షాలు లేక అది కూడా ఎండిపోవడంతో గ్రామానికి తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. జి.శివడ, ఒబ్బంగి, తిత్తిరి, జరడ, పొడి పంచాయతీల్లో కొండలపై ఉన్న గ్రామాల్లోనూ నీటి సమస్య తీవ్రంగా ఉంది. కొమరాడ మండలం చోళ్లపథం పంచాయతీ రెబ్బలో 30గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామంలో ఒక్క మంచినీటి బోరు కూడా లేదు. దీంతో ఊరికి దూరంగా ఉన్న గెడ్డలో గోతులు తీసుకుని, అందులో ఊరిన నీటిని పట్టుకుని తాగుతున్నారు. ఆ గెడ్డ నీటికి రెండు కిలోమీటర్ల దూరంలో వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల వర్షాలు లేక గెడ్డ కూడా పారడం మానేసింది. దీంతో గెడ్డలో ఎక్కడ గొయ్యి తవ్వినా ఊట రావడంలేదు. దీంతో గ్రామస్తులకు తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. వేసవికి ముందే ఈ పరిస్థితి రావడంతో ఆందోళన చెబుతున్నారు. ఇలా ఈ మండలంలో కుంతేసు, గుర్లమ్మ, ఊసనందితో పాటు మరో నాలుగు పంచాయతీల్లో గిరిజనం తాగునీటికి కటకటలాడుతున్నారు. గుమ్మలక్ష్మీపురం 10 పంచాయతీల్లో, జియ్యమ్మవలస, కొమరాడ చెరో ఎనిమిది, సాలూరు, మక్కువల్లో ఆరు చొప్పున పంచాయతీల్లోని గిరిశిఖర గ్రామాల్లో దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొంది.

టిడిపి హయాంలో పంచాయతీరాజ్‌శాఖా మంత్రి నారాలోకేష్ కురుపాం, ఎస్.కోట నియోజకవర్గాల్లో రెండు తాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇదే విషయమై సెప్టెంబర్ 24న 11, 49 నెంబర్లతో జీవోలు విడుదల చేశారు. రూ.190 కోట్లతో ఎస్.కోట పథకాన్ని, రూ.110కోట్లతో కురుపాం పథకాన్ని చేపట్టనున్నట్లు ఆయా ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఇలాంటివన్నీ కలిపి ఆంధ్రప్రదేశ్ తాగునీటి సరఫరా సంస్థ (ఎపిడబ్ల్యుఎస్‌సి) ద్వారా రూ.5,330కోట్లు కేటాయించింది. కానీ, నెలరోజుల తర్వాత ఈ జీవోలో పేర్కొన్న కురుపాం ప్రాజెక్టు కనిపించలేదు. ఇవే నెంబర్లతో సెప్టెంబర్ 26న విడుదల చేసిన కొత్త ఉత్తర్వులో కురుపాం బదులు గజపతినగరం మండలం గంట్యాడ, చీపురుపల్లి ప్రాజెక్టులు ఉండడం గమనార్హం. దీనిబట్టి గిరిజనులపై వారు ఎంత ప్రేమ చూపుతున్నారో అర్థమవుతోంది. ఏజెన్సీ ప్రాజెక్టును మైదానానికి మార్చుచేసి కురుపాం ప్రాజెక్టుకు కేటాయించిన రూ.110కోట్లలో రూ.80.71కోట్లు గంట్యాడ ప్రాజెక్టుకు, రూ.29.29కోట్ల చీపురుపల్లి ప్రాజెక్టుకు ప్రభుత్వం సర్దుబాటు చేసింది. ఈ పథకాల ద్వారా గంట్యాడ మండల కేంద్రంతోపాటు కొన్ని గ్రామాలు, చీపురుపల్లితోపాటు 45 గ్రామాలకు తాగునీటి అవసరాలు తీరుతాయని అధికారులు చెబుతున్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన కురుపాం నియోజకవర్గానికి మంజూరుచేసిన పథకాన్ని మైదాన ప్రాంతంలోని టిడిపి నాయకులు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకు మళ్లించడం పట్ల తీవ్ర విమర్శలు రేకెత్తాయి. ప్రస్తుతం వైసిపి కూడా అదే ధోరణి కొనసాగిస్తుందని మన్యం ప్రజలు మండిపడుతున్నారు.

నీటి కష్టాలు తప్పడం లేదు

మా గ్రామంలో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు.నీటి సమస్య గురించి అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కనీసం పట్టించుకోలేదు. ఐదేళ్లకోసారి ఓట్లు కోసం వస్తున్న నాయకులు మా కష్టాలు గుర్తించడం లేదు. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి.

జీలకర్ర హైమ
జోగిపురం, గుమ్మలక్ష్మీపురం మండలం

నీటి సమస్య లేకుండా చూడాలి

మా గ్రామంలో నీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. గ్రామంలో ఉన్న బోర్లు లేక పోవడం తో చలము నీటిపై ఆధార పడుతున్నాం. గ్రేవటి సరిగ్గా పని చేయక పోవడంతో వేసవిలో తాగునీటి కష్టాలు తప్పడం లేదు.

- తోయక పార్వతి,
సప్పగూడ గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం

పాలకుల నిర్లక్ష్యం

ఏళ్ల తరబడి గిరిజనుల పట్ల పాలకుల నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఎన్నికల్లో ఓట్ల కోసం వస్తున్న వివిధ పార్టీల నేతలు గెలిచాక గిరిజనుల సమస్యలను పట్టించుకోవడం లేదు. దీంతో సమస్య సమస్యగానే మిగిలి పోతుంది.

- కోలక అవినాష్,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

అగ్రహారమే ఎన్నికల ఎజెండా!

తాతలు, తండ్రుల కాలం నుంచి హక్కులు లేకుండా అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు మారుతున్నారు తప్ప అగ్రహార భూముల సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఈ నేపథ్యంలోనే గత ఏడాది మే 25న భూములకు అప్పటి తహాశీల్దార్ పబ్లిక్ నోటిఫికేషన్ వేసి అన్నదాతల్లో ఆశలు రేపారు. తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూములను ఇనాం వాటా కింద 1/3 షేర్ కేటాయించిన అధికారులపై మండిపడినప్పటికీ.. ఇప్పటికైనా భూసమస్య పరిష్కారానికి నోచుకుంటుందని ఆశ పడ్డారు. నోటిఫికేషన్‌లో అనేక తప్పుల తడకలు ఉన్నప్పటికీ సమస్య పరిష్కారం కోసం ప్రశ్నించకుండా అధికారులకు సహకరించాలని భావించారు. తమ భూములపై అభ్యంతరాలను అధికారుల సూచనల మేరకు అందజేశారు. ఈ పక్రియ జరిగి సుమారుగా ఏడాది కావస్తున్నా... అగ్రహారంపై ఎటువంటి అడుగులూ ముందుకు పడలేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు రావడం ప్రస్తుతం అగ్రహార సమస్య ఎన్నికల ఎజెండాగా మారింది.

- నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకున్న వైసిపి
- టిడిపి ప్రభుత్వంలోనూ నిర్లక్ష్యమే
- అయోమయంలో అన్నదాతలు
- పరిష్కరించే హామీకే ప్రజల ఓటు

ప్రజాశక్తి - జామి

ఎన్నికలు సమీపిస్తున్న వేళ జామి అగ్రహార భూముల సమస్య నాయకులకు అసలు ఎజెండాగా మారింది. తాతలు తండ్రుల నుంచి భూ హక్కులు సిద్ధించక నానా అవస్థలు పడుతున్న రైతాంగానికి పాలకులు మొండిచేయి చూపిస్తూనే ఉన్నారు. అయితే ఈసారి ఎన్నికల్లో పోటీకి చేసే నేతలు అగ్రహార భూ సమస్యకు కచ్చితమైన హామీ ఇవ్వాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హామీతో పాటు అమలు చేసే వారికే ఓటు వేయాలని ఈ ప్రాంత రైతాంగం భావిస్తోంది.

జామి మండల కేంద్రంలో సుమారుగా 2600 ఎకరాల వరకు ఇనాం భూములు (అగ్రహారం) కింద ఉన్నాయి. వీటికి హక్కులు కల్పించాలని రైతులు ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. 2009లో భూ సర్వే ప్రారంభమై, గత ఏడాది 25న అప్పటి తహాశీల్దార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 30 రోజుల్లో నోటీసులో పొందుపర్చిన వివరాలపై అభ్యంతరాలు తెలపాలని

జామిలోనే అగ్రహారం భూమి

పేర్కొన్నారు. అంతుపట్టని పలు అంశాలు నోటిఫికేషన్‌లో రావడంతో అప్పట్లో రైతులు గందరగోళానికి గురయ్యారు. ప్రధానంగా నోటిఫికేషన్‌లో ఇనాందారుని పేరు రాయకుండానే ఇనాం వాటా కింద 1/3 భూమిని కేటాయించడం గందరగోళాన్ని సృష్టించింది.. ఇనాంఅండ్ ఎస్టేట్ అనాలిసిన్ యాక్ట్ ప్రకారం సాగుదారునికి 2/3, ఇనాందారునికి 1/3 వాటా భూమి కేటాయించడం న్యాయమే. కానీ తాతల తండ్రుల కాలం నుంచి కానరాని ఇనాందారుడి పేరున భూ కేటాయింపు చేయడం ఏంటని ప్రశ్నలు లేవనెత్తారు.

అయినప్పటికీ అధికారులు చెప్పిన మాటలకు కట్టుబడి నోటిఫికేషన్ ప్రక్రియ ముందుకు సాగాలని రైతులు భావించారు. కానీ సుమారుగా ఏడాది కాలం సమీపిస్తున్నా నోటిఫికేషన్ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అగ్రహారం భూ సమస్యపై పూర్తి స్థాయి స్పష్టత ఇచ్చేలా, ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు ప్రకటనలు ఇవ్వాలని, అటువంటి నేతలకే ఓటు వేయాలని రైతులు బావిస్తున్నారు.

కురుపాంలో మహిళా ఎమ్మెల్యే ఒకరే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గం చరిత్రలో ఇప్పటి వరకూ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక్క మహిళా ఎమ్మెల్యేగా పాముల పుష్పశ్రీవాణి రెండుసార్లు విజయం సాధించారు. 2014లో మొదటిసారి రాజకీయాల్లోకి వచ్చిన ఆమె ప్రత్యర్థి టిడిపి అభ్యర్థి జనార్ధన థాట్రాజ్‌పై 19083 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో రెండోసారి కూడా జనార్ధన థాట్రాజ్ పై 26602 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. పుష్ప శ్రీవాణి ఎమ్మెల్యే పదవితో పాటు డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా కూడా పనిచేశారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారంతా పురుషులే ఉన్నారు.

నాగూరులో 11... కురుపాంలో 2

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

57 ఏళ్ల అసెంబ్లీ ఎన్నికల్లో నాగూరులో 11 సార్లు ఎన్నికలు జరగ్గా, కురుపాం లో 2 ఎన్నికలు జరిగాయి. నాలుగు సార్లు కాంగ్రెస్, టిడిపి, సిపిఎం, జనాత ఒక్కొక్కసారి గెలుపొందగా, రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. 2009 నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా ఏర్పడిన కురుపాంలో కాంగ్రెస్ ఒకసారి, 2014, 19లో వైసిపి రెండుసార్లు విజయం సాధించాయి. ఈ నియోజకవర్గంలో సిపిఎంనేతగా ఉన్న కోలక లక్ష్మణమూర్తి 2004 ఎన్నికల్లో గెలుపొందారు. ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన శత్రుచర్ల విజయరామరాజు ఎంపిగా గెలుపొందారు. శత్రుచర్ల చంద్రశేఖర్ రాజు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఒకసారి గెలుపొందారు.

నాడు కోలాహలం.. నేడు నిర్మానుష్యం

మూగబోయిన మాజీ మంత్రి పతివాడ స్వగృహం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

సార్వత్రిక ఎన్నికలు వచ్చాయంటే ఆ గృహంలో కోలాహలం మొదలయ్యేది. పతివాడకు జిందాబాద్.. అంటూ నినాదాలు.. కేరింతలు.. కేకలు వినిపించేవి. అన్ని దారులూ ఆ గ్రామం వైపే అన్నట్లు ఉండేది మండలంలోని చల్లవానితోటలోని మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు స్వగృహం. దాదాపు ఐదు దశాబ్దాల తరువాత సార్వత్రిక ఎన్నికల వేళ ఆ గృహం మూగబోయింది. నాటి ఎన్నికల కోలాహలం గుర్తు చేసుకుంటూ ఆ గ్రామస్తులు నివ్వెరపోతున్నారు.

పతివాడ నారాయణస్వామినాయుడు.. ఈ పేరు దాదాపుగా అందరికీ సుపరిచితమే. ఎందుకంటే ఆయన పది సార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి ఏడు సార్లు విజయం సాధించిన ఘనుడు. చంద్రబాబు కేబినెట్‌లో చక్కెర, ఉద్యానవన శాఖా మంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో ఏర్పడ్డ చంద్రబాబు ప్రభుత్వంలో ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణాలు చేయించారు. అంతటి ఖ్యాతి ఉన్న పతివాడ రాజకీయ జీవితం ఈ ఎన్నికలతో కనుమరుగవుతోంది.

పతివాడ నారాయణస్వామి నాయుడు 1978లో రాజకీయ ప్రవేశం చేసి జనతా పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం ఎన్‌టిఆర్ పెట్టిన తెలుగుదేశం పార్టీలో చేరి అప్పటి భోగాపురం నియోజకవర్గం నుండి 1983లో ఎమ్మెల్యేగా బరిలో దిగి విజయం సాధించారు. అప్పటి నుంచి వరుసగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, 30 సంవత్సరాలు ఏక చక్రాధిపత్యం సాగించారు. భోగాపురం నియోజకవర్గం నుంచి నెల్లిమర్ల నియోజకవర్గంగా పునర్విభజన తరువాత వచ్చిన 2009లో ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు చేతిలో ఓటమి పాలయ్యారు. 2014లో మరలా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు చేతిలో ఓటమి చెందారు. ఆ తరువాత నుంచి ఆయన వయస్సు మీద పడటంతో ప్రత్యేక్య రాజకీయాలకు దూరమవుతూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే

పతివాడ నారాయణస్వామి నాయుడు ; నిర్మానుష్యంగా మారిన చల్లవానితోటలోని పతివాడ నివాసం

నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న ఆయన్ను మార్చి కర్రోతు బంగార్రాజుకు బాధ్యతలు అప్పగించారు.

50 ఏళ్లు సందడి కనుమరుగు

సుమారు 50 ఏళ్లపాటు ఆ గ్రామంలో, ఆ గృహంలో ఎన్నికలు వచ్చాయంటే కోలాహలం మొదలయ్యేది. నెల రోజుల ముందు నుండే వంటలు, వడ్డింపులు, జెండాలు, కరపత్రాలు. ప్రచార వాహనాలు, మందుగుండు సామగ్రి, సమావేశాలు, సభలు ఇలా పండగ వాతావరణమే ఉండేది. అనుదినం వందలాది మంది నాయకులు, కార్యకర్తలు ఆ ఇంటికి వస్తూ వెళుతూ జాతరను తలపించేది. అలాంటి పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు. పతివాడ వృద్ధాప్యం కారణంగా 2023లో టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు నుండి తప్పించారు. అయినా పెద్దాయనంటూ టిడిపిలో జరిగే ఏ కార్యక్రమమైనా ఆయన గృహంలోనే జరిగేది. అయితే రాజకీయ సమీకరణాలు నేపథ్యంలో ఈ ఎన్నికల్లో నెల్లిమర్ల నియోజకవర్గం నుండి టిడిపి సీటును జనసేనకు కేటాయించారు. నియోజకవర్గానికి సంబంధించిన వ్యవహారాలన్నీ జనసేన అభ్యర్థి స్వగృహం భోగాపురం మండలం ముంజేరు నుండే సాగుతున్నాయి. దీంతో పతివాడ గృహం నిర్మానుష్యంగా మారిపోయింది. అటువైపు వెలుతున్న తెలుగు తమ్ముళ్లతో పాటు గ్రామస్తులు నాటి కోలాహలం గుర్తు చేసుకుంటూ ఇంతలోనే ఎంత మార్పు అంటూ చర్చించుకుంటున్నారు.

వడదెబ్బపై అవగాహన

ప్రజాశక్తి-కొత్తవలస

వేసవిలో ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని తుమ్మికాపల్లి, ముసిరాం, ఉత్తరాపల్లి, రామలింగాపురం గ్రామాల్లో ఉపాధి వేతనదారులకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉదయం 10 గంటలు తర్వాత, సాయంత్రం 4 గంటల్లోపు ఎండలో తిరగరాదని సూచించారు. కార్యక్రమంలో ఇఒ నరసింహరావు, హెచ్ఎస్ ఈశ్వరరావు, హెచ్‌వి పద్మావతి, హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

సీతంపేట: సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న గిరిజన గురుకుల బాలుర, బాలికల కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ ప్రిన్సిపాల్ పి నాగభూషణ్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీ నుండి మే నెల 15వ తేదీ వరకు www.aptw.gurukulam.ap.gov.in. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-వేపాడ

ఎన్నికల నేపథ్యంలో ఎప్పుడు సమావేశం జరిగినా అందుబాటులో ఉండాలని ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాలభాస్కరరావు.. ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక ఎంఆర్‌సిలో మంగళవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా ఎన్నికల సందర్భంగా డిఇఒ పరిధిలో ఉండాలని చెప్పారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టి, బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని సూచించారు.

చెరువును ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని పాత బొబ్బిలి రెవెన్యూ సర్వే నంబర్ 100-10లో ఉన్న 81 సెంట్ల చెరువును ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డి కళ్యాణ్ చక్రవర్తి హెచ్చరించారు. చెరువులో మట్టి వేసి కప్పడంతో గుర్తించిన రెవెన్యూ అధికారులు.. చెరువు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని బోర్డు ఏర్పాటుచేశారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు ఆక్రమణకు గురికాకుండా ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా నీలమ్మతల్లి ఉత్సవాలు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని లివిరి పంచాయతీ పరిధిలోని గజపతినగరంలో గ్రామ దేవత నీలమ్మ తల్లి ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతకు పసుపు ముగ్రాట నీరు పోషి చల్లదనం చేశారు. బుధవారం ఉజ్జిడి కార్యక్రమం నిర్వహిస్తామని, గురువారం గ్రామ దేవత ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు.

ఆదర్శ నియోజకవర్గంగా తయారు చేస్తా : కోండ్రు

రేగిడి : సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే రాజాం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తయారు చేస్తానని మాజీ మంత్రి, ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఈ మేరకు మండలంలోని దేవుదల, పుర్లి, కొమిరి, ఖండ్యాం, వన్నలి, అంబకండి, సోమరాజుపేట గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు రూపకల్పన చేసిన సూపర్ సిక్స్ పథకాలు బీసీ డిక్లరేషన్ పై ప్రజలకు వివరిస్తూ తనను గెలిపించాలని కోరారు. కోండ్రు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి 10 రూపాయలు ఇచ్చి వంద దోచుకోంటున్నాడని, డ్రైవర్‌లకు రూ.10 వేలు ఇచ్చి పెట్రోల్, డీజిల్, పోలీస్ జరిమానాలు, గ్రీన్ టాక్స్, మద్యం రేట్లు పెంచి లక్ష కొట్టేస్తూ మోసం చేస్తున్నాడని అన్నారు. అనంతరం కొమిరి, ఖండ్యాం గ్రామాల నుంచి 60 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరాయి. వీరికి కోండ్రు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, మజ్జి శ్రీను, మంతిన ఉషారాణి, మజ్జి దాలి నాయుడు, అప్పల నాయుడు, దుర్గారావు, దూబ అప్పల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ డిప్యూటీ డిఇఒగా నారాయుడు

సీతంపేట : స్థానిక ఐటిడిఎ డిప్యూటీ డిఇఒగా పాలక నారాయుడుకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు డిడి అన్నదొర ఒక ప్రకటనలో తెలిపారు గతంలో పనిచేసిన డిప్యూటీ డిఇఒ ఉద్యోగ విరమణ చేయడంతో నారాయడుకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈయన మల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

జిల్లా టాపర్‌కు యుటిఎఫ్ అభినందన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పదో తరగతి పరీక్షల్లో 591 మార్కులతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన కెబి గౌతమిని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అభినందించారు. పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో ఆడబడి వీధిలో గల తిరుమల రామమూర్తి మెమోరియల్ (టిఆర్ఎం) మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారి తల్లిదండ్రులను, విద్యార్థులను యుటిఎఫ్ నాయకులు సన్మానించారు. జిల్లా శాఖ తరపున వెయ్యి రూపాయలు నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మురళీమోహనరావు, జిల్లా అధ్యక్షులు టి.రమేష్, జిల్లా కార్యదర్శి భాస్కరరావు, పట్టణ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సభ్యులు గౌతమిని ఘనంగా సన్మానించారు.

జిల్లా టాపర్ గౌతమిని అభినందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

జడ్పీ హైస్కూల్లో విద్యార్థుల ప్రతిభ

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాలల ఖ్యాతిని చాటారు. బందలుప్పి జడ్పీహెచ్‌ఎస్ నుంచి 80 మంది విద్యార్థులకు గానూ 79 మంది పాసై 98.75శాతం విజయం సాధించగా, తాళ్లబురిడి జడ్పీహెచ్‌ఎస్ 25కు గాను 25 మంది పాసై 100శాతం ఫలితాలు సాధించారు. పెదబొండపల్లి జడ్పీహెచ్‌ఎస్ నుండి 69 కి గాను 68 మంది ఉత్తీర్ణత పొంది 98.55శాతం ఉత్తీర్ణలు కాగా, ఎమ్మార్ నగరం జడ్పీహెచ్‌ఎస్ నుంచి 91మందికి 87 మంది పాసై 95. 60శాతం సాధించారు. ఎన్.ములగ జడ్పీహెచ్ఎస్ నుంచి 29 మందికి గాను 29 మంది ఫలితాలు సాధించి 100శాతం విజయాన్ని నమోదు చేశారు. నర్సిపురం జడ్పీహెచ్ఎస్ నుండి 66 మంది విద్యార్థులు హాజరుకాగా 56 ఫలితాలు సాధించి 84. 85 శాతం విజయం నమోదు చేశారు. ఈ మేరకు విద్యార్థులను ఎంఇఒ ఎన్ సింహాచలం, ప్రధానోపాధ్యాయురాలు వి.గౌరి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.


బలిజిపేట : పెదపెంకి విద్యార్థినులను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

బలిజిపేట: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని పెదపెంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను ఆ పాఠశాల గ్రామ పెద్దలు, సర్పంచ్ సమక్షంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయిలో మార్కులు తెచ్చుకోవడం ప్రశంసనీయమని, గ్రామానికి పాఠశాల ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చిన తిరుమారెడ్డి అఖిల (579), పల్లెడ జ్యోతి(560) ప్రథమ ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్న విద్యార్థులను అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : టెన్త్ ఫలితాల్లో మండలంలో ప్రథమ స్థానం సంపాదించిన జులైకా బేగం (582మార్కులు), జి.పూజిత (579మార్కులు)ను ఎంఇఒ, యుటిఎఫ్ నాయకులు సత్కరించారు. అనంతరం వీరికి నగదు బహుమతిని కూడా అందజేశారు.

567 మార్కులతో గిరిజన విద్యార్థిని

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని భద్రగిరి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో చదువుతున్న అడ్డాకుల బిందుమతి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 567 మార్కులు సాధించింది. ఐటిడిఎ పరిధిలో గల అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలల కంటే అత్యధిక స్థాయిలో మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రతిభ చూపిన విద్యార్థినికి ఎటిడబ్ల్యూఒ సురేష్ కుమార్, హెచ్ఎం బి.స్రవంతి అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరిసిన ఆణిముత్యాలు

పాలకొండ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలలతో పోటీ పడుతూ మెరుగైన ఫలితాలు సాధించారు. ఎం.సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 47 మంది విద్యార్థులకు గాను 47 మంది పూర్తిగా ఉత్తీర్ణత సాధించారు. ఇదే పాఠశాల విద్యార్థి సవిరిగాన మనోజ్ కుమార్ 588 మార్కులు సాధించి జిల్లాలో రెండవ స్థానంలో నిలిచి కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో అభినందనలు పొందారు. అదే పాఠశాలకు చెందిన దుంప రమ్య 586 మార్కులు సాధించారు. వీరిని పాఠశాల హెచ్ఎం సంఘం నాయుడు విద్యార్థులను అభినందించారు. అలాగే చిన్న మంగళాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వారాడ భావన 575 మార్కులు సాధించింది.

ఎస్.కోట కాంగ్రెస్ అభ్యర్థిగా గేదెల

ప్రజాశక్తి - శృంగవరపుకోట, జామి

ప్రముఖ వైద్యులు గేదెల తిరుపతి కాంగ్రెస్ అభ్యర్థిగా శృంగవరపుకోట బరిలో నిలువనున్నారు. ఈ మేరకు మంగళవారం పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బి-ఫారం అందజేసి, లైన్ క్లియర్ చేశారు. తొలి నుంచి శృంగవరపుకోట కాంగ్రెస్ అభ్యర్థి స్థానానికి తీవ్ర పోటీ నెలకొంది. అయితే గడి బంగారు నాయుడు చివరి వరకూ పోటీ పడ్డారు. కానీ చివరికి గేదెలను టికెట్ వరించింది. గేదెల తొలి నుంచీ ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తిగా నియోజకవర్గంలో అందరికీ సుపరిచితులు. జామి, గంట్యాడ, కొత్తవలస మండలాల్లో బంధుత్వాలు మెండుగా ఉన్న వ్యక్తి. తన తండ్రి గేదెల సన్నిబాబు జ్ఞాపకార్థం పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న వ్యక్తిగా అందరికీ చేరువయ్యారు. ఈ నేపథ్యంలోనే డాక్టర్ తిరుపతిరావును శృంగవరపుకోట అభ్యర్థిగా పోటీకి అవకాశం కల్పించడం సమంజసమేనని నియోజకవర్గ ప్రజలు హర్షిస్తున్నారు.

షర్మిల నుంచి బి-ఫారం అందుకుంటున్న తిరుపతి

ఇండియా వేదిక అభ్యర్థిగా మేధావుల మద్దతు

కాంగ్రెస్ పార్టీలో వైఎస్ షర్మిల చేరిన తరుణంలో ఆ పార్టీ పుంజుకుంటున్న తరుణంలో గేదెలకు టికెట్ ఇవ్వడంతోపాటు ఇండియా వేదికలో ఉన్న సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల మద్దతుగా మెండుగా ఉంది. మేధావులు, యువత, మైనారిటీల మద్దతు పలికే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో అటు టిడిపి, వైసిపిలు గేదెల పోటీపై ఆందోళన చెందుతున్నాయి.

సంక్షేమం కావాలంటే వైసిపి రావాలి : రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

నియోజకవర్గంలో మరింత అభివృద్ధి, సంక్షేమం కావాలంటే వైసిపి అభ్యర్థిగా రాజన్నదొరని మరోసారి గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి కోరారు. మంగళవారం ఆమె కొత్తవలస పంచాయతీ పరిధిలో ఉన్న దాగరవలస, గుండ్రపువలస గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీ జరిగిందని చెప్పారు. ముడుపులు ఇవ్వనిదే పథకాలు అందే పరిస్థితి లేదన్నారు. రూపాయి ఖర్చు లేకుండా వైసిపి ప్రభుత్వం హయాంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని మళ్ళీ గెలిపించాలని, రాజన్నదొరకి మరో అవకాశం ఇవ్వాలని రెడ్డి పద్మావతి కోరారు. ఆమె వెంట వైసిపి నాయకులు నెమలి పిట్ట కళ్యాణ్, జయసింహ, సర్పంచ్ నెమలి పిట్ట ధర్మావతి, నాయకులు సీతారాం వున్నారు.

ఎస్.లోకేష్ (578),

కె.మహేంద్ర 549,

బి.దుర్గాప్రసాద్ (528)

భోగాపురం హైస్కూల్లో 81 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి- భోగాపురం

మండలం లోని భోగాపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షల్లో 81 శాతం ఉత్తీర్ణత సాధించింది. పాఠశాలకు చెందిన సంకాబత్తుల లోకేష్ 578మార్కులు సాధించి మండలంలో రెండో స్థానంలో నిలిచాడు. కోడా మహేంద్ర 549 మార్కులు, బి.దుర్గా ప్రసాద్ 528 మార్కులు సాధించి పాఠశాల లలో వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. పాఠశాలలో మొత్తం 101 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కాగా, 82 మంది ఉత్తీర్ణులై 81.18శాతం నమోదు చేశారు. ఇందులో తెలుగు మీడియంలో 76 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఇందులో 58 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంగ్లీష్ మీడియం లో 25మందికి గాను 24 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం పిఎజిహెచ్ఎస్ శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులంతా అభినందించారు.

లక్ష్మీగణపతిలో నూరుశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - విజయనగరంటౌన్

పదో తరగతి ఫలితాల్లో నగరంలోని కెఎల్‌పురంలోని లక్ష్మీగణపతి ఇంగ్లీషుమీడియం స్కూలు నూరు శాతం ఉత్తీర్ణత సాధిం చింది. పాఠ శాలకు చెందిన విద్యార్థిని ఎం.రూపిత 586 మార్కులు సాధం చడమే కాకుండ హాజరైన విద్యార్థుల అందరూ మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పద్మరాజు, యాజమాన్యం అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్

మే 13న దుకాణాలు, సంస్థలకు సెలవు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సార్వత్రిక ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మే 13వ తేదీన జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని దుకాణాలు, వాణిజ్య పారిశ్రామిక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ ఓటుహక్కును వినియోగించుకోవడానికి వీలుగా ఆరోజు రాష్ట్రంలోని దుకాణాలు, వాణిజ్య సంస్థలకు సెలవుదినంగా ప్రకటిస్తూ రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు కార్మికశాఖ ఉప కమిషనర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థల్లో పనిచేస్తూ ఓటుహక్కు కలిగిన ప్రతి వ్యక్తికి పోలింగ్ రోజున ఆయా సంస్థలు సెలవు మంజూరు చేయాల్సి వుంటుందన్నారు. పోలింగ్ రోజున వారు పనిచేసే సంస్థ లేదా కార్యాలయం మూసివేయనప్పటికీ పోలింగ్ రోజున సెలవు, వేతనాలు పొందేందుకు అర్హులని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి అదితి గజపతిరాజు

నేడు బాబు, పవన్ బహిరంగ సభ

తరలిరావాలని టిడిపి, జనసేన నాయకుల పిలుపు

నేడు అదితి విజయలక్ష్మి నామినేషన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా ఏర్పాటు చేస్తున్న కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభను జయప్రదం చేయాలని విజయనగరం టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి పాలవలస యశస్విని, బిజెపి నాయకులు సుధీర్ కోరారు. మంగళవారం అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ బుధవారం సాయంత్రం ఐదు గంటలకు స్థానిక కలెక్టరేట్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సభలో పాల్గొంటారని తెలిపారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు మాట్లాడుతూ ఉదయం 10.30గంటలకు అదితి విజయలక్ష్మి గజపతిరాజు నామినేషన్ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, నాయకులు అవనాపు విజయ్, గాదు అప్పారావు, జనసేన నాయకులు రౌతు సతీష్, బొబ్బాది చంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ ఎంఎం నాయక్, డాక్టర్ తిరుమలప్రసాద్

రోటరీ ఆధ్వర్యాన చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మండుటెండల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని నగర కమిషనర్ మల్లయ్య నాయుడు పేర్కొన్నారు. మంగళవారం మయూరి హోటల్ జంక్షన్ వద్ద రోటరీ ప్రధాన క్లబ్ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోజురోజుకీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కారణంగా అత్యవసర పనిమీద తిరుగుతున్న వారికి వడదెబ్బకు గురికాకుండా పట్టణంలోని స్వచ్ఛంద సంస్థలు ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రాంతంలో, కూడలిలో మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేసి పాదచారులకు, వాహన చోదకులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రోటరీ ప్రధాన క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణశాంతి ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ మజ్జిగ చలివేంద్రం ద్వారా వందల మందికి మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ కమ్యూనిటీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ కె.తిరుమల ప్రసాద్, క్లబ్ కార్యదర్శి నీతివిజ్వాని, డాక్టర్ వెంకటేశ్వరరావు తోపాటు క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదోరోజు 32 నామినేషన్లు

విజయనగరంలో పార్లమెంటుకు 6, అసెంబ్లీకి 16 • మన్యం జిల్లాలో పార్లమెంట్‌కు 2.. అసెంబ్లీకి 8

ప్రజాశక్తి-విజయనగరం కోట, పార్వతీపురం రూరల్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఐదో రోజు మంగళవారం 32 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో విజయనగరం పార్లమెంట్ స్థానానికి 6 నామినేషన్లు, 7 అసెంబ్లీ స్థానాలకు 16 నామినేషన్లు వేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అరకు పార్లమెంట్ స్థానానికి 2 నామినేషన్లు, 4 అసెంబ్లీ స్థానాలకు 8 నామినేషన్లు దాఖలయ్యాయి.

విజయనగరం పార్లమెంటు స్థానం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తన ఛాంబర్‌లో పార్లమెంటు అభ్యర్థులనుంచి నామినేషన్లు స్వీకరించారు. సమాజ్‌వాదీ పార్టీనుంచి సామిరెడ్డి అచ్చియ్యనాయుడు, బిఎస్‌పి నుంచి పీరుబడి ప్రకాశరావు, స్వతంత్ర అభ్యర్థిగా పివిఎ ఆనందసాగర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి సఖినేటి అనంతరాజు, జై భీమారావు భారత్ పార్టీ నుంచి చిన్నం అరుణకుమారి, స్వతంత్ర అభ్యర్థిగా వేలూరి వెంకట త్రినాథరావు నామినేషన్లు వేశారు.

విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంనుంచి స్వతంత్ర అభ్యర్థిగా కండివలస సురేష్, జై భీమారావు పార్టీ తరపున చింతపల్లి దుర్గారావు, అఖిలభారతీయ జనసంఫ్ పార్టీ నుంచి పోలిపల్లి కిరణ్‌కుమార్ తమ నామినేషన్లను జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌కు అందజేశారు.

గజపతినగరం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా జి.కూర్మినాయుడు, చీపురుపల్లిలో కాంగ్రెస్ పార్టీ తరపున తుమ్మగంటి సూరినాయుడు, స్వతంత్ర అభ్యర్థిగా గుడివాడ షణ్ముఖరావు, బిఎస్‌పి నుంచి అర్జి శివప్రసాద్ నామినేషన్ వేశారు. ఎస్‌కోట నియోజకవర్గంలో బిఎస్‌పి తరపున బోను కృష్ణ నామినేషన్ వేశారు. రాజాం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా గండి అప్పారావు, కాంగ్రెస్ తరపున కంబాల రాజవర్దన, టిడిపి నుంచి కోండ్రు మురళీమోహన్ నామినేషన్ పత్రాలను అందజేశారు. బొబ్బిలి నియోజకవర్గంలో టిడిపి నుంచి బిఎస్‌కె కృష్ణ రంగారావు నామినేషన్ వేశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఎవరూ నామినేషన్లు వేయలేదు.

మన్యం జిల్లాలో అరకు పార్లమెంటు నియోజక వర్గానికి తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థిగా జల్లి రాంబాబు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా బద్దెన చంటిబాబు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి నిశాంత్ కుమార్ కు అందజేశారు.

పార్వతీపురంలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బత్తిన మోహనరావు

పార్వతీపురం శాసన సభ నియోజక వర్గంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా బత్తిన మోహన రావు, స్వతంత్ర అభ్యర్థిగా గర్బాపు మోహన రావు నామినేషన్లు వేశారు. కురుపాం నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థి మండంగి రమణ, స్వతంత్ర అభ్యర్థి నిమ్మక జయరాజు, టిడిపి అభ్యర్థి తోయక జగదీశ్వరి పత్రాలను రిటర్నింగ్ అధికారి వివి రమణకు అందజేశారు.

పాలకొండ నియోజక వర్గంలో వైసిపి అభ్యర్థి ఒ.ల్లేభద్ర లక్ష్మి నామినేషన్ వేశారు. సాలూరు నియోజక వర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా కంచరి బంగారు రాజు, కెల్ల మురళి నామినేషన్ పత్రాలను సి. విష్ణు చరణ్ కు అందజేశారు.

ఓటడిగే అర్హత పాలక పార్టీలకు లేదు

- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి
- నేడు కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి శ్రీను నామినేషన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

దేశంలోనూ, రాష్ట్రంలోనూ పాలకవర్గాలు ప్రజలను ఓటు అడిగే అర్హత కోల్పోయాయని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ విజయనగరం కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి బొబ్బిలి శ్రీను అన్నారు. మంగళవారం ఒక ప్రైవేటు హొటల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి పరిచయ కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ రాజ్యాంగ స్వభావాన్ని కాపాడుకోవడానికి ఇండియా కూటమి పోరాటం చేస్తుందన్నారు పదేళ్ల మోడీ పాలనలో దేశ సంపదను కార్పొరేట్లకు అమ్మేస్తూ, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ ప్రజల జీవనాన్ని విచ్ఛిన్నం చేసిందని అన్నారు. మతాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య గొడవలు సృష్టించడమే వారి ప్రధాన కర్తవ్యమన్నారు. రానున్న రోజుల్లో భారతదేశాన్ని ఒక హిందువు రాజ్యంగా చేయాలని భావిస్తోందన్నారు. ఉత్తరాంధ్రకు తలమానికమైన స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్‌శక్తులకు కట్టబెట్టేందుకు మోడీ ప్రయత్నిస్తున్నాడని అన్నారు. ఈనేపథ్యంలో దేశంలోని బిజెపి ప్రభుత్వాన్ని, దానితో జతకట్టిన టిడిపి, జనసేన, మద్దతిస్తున్న వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. కామేశ్వరరావు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అనేకమైన మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రజలను మభ్యపెట్టి దేశాన్ని మతతత్వంగా మారుస్తున్నాడని అన్నారు. నిజాయితీగా పాలనందిస్తున్న కేరళ ముఖ్యమంత్రిపైనా, ఢిల్లీ ముఖ్యమంత్రిపైనా విష ప్రచారం చేస్తున్నాడని అన్నారు. ఇంకా అనేక చట్టాలను తెచ్చి ప్రజలు నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు ఇండియా కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో గెలిచిన బెల్లాన చంద్రశేఖర్ విజయనగరం జిల్లా సమస్యలపై ఒక్కరోజైనా పార్లమెంట్లో నోరు విప్పారా అని ప్రశ్నించారు. విజయనగరం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బొబ్బిలి శ్రీను మాట్లాడుతూ దేశంలో నియంత పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను విద్య, వైద్యం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. తనను గెలిపిస్తే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు, అభిమానులు ప్రజలు వేలాదిగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు, నెల్లిమర్ల అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి డోల శ్రీనివాస్, విజయనగరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు శనపతినేటి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి, సిపిఎం, సిపిఐ నాయకులు

గల్లీస్థాయికి దిగజారిన చంద్రబాబు

- దమ్ముంటే ఆరోపణలు నిరూపించండి
- టిడిపి అధినేతకు ఎమ్మెల్యే కడుబండి సవాల్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అసత్య ఆరోపణలతో 40 ఏళ్ల అనుభవం ఉన్న చంద్రబాబు గల్లీ స్థాయికి దిగజారారని శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు విరుచుకుపడ్డారు. తనపై చేసిన ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. సోమవారం ప్రజాగళం యాత్రలో టిడిపి అధినేత చంద్రబాబు చేసిన ఆరోపణలను తీవ్రంగా వ్యతిరేకించారు. మంగళవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ అబద్ధాలతో ఆటలు సాగవన్నారు. అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏం చేస్తామో చెప్పలేని 40

సమావేశంలో మాట్లాడుతున్న కడుబండి శ్రీనివాసరావు

ఇయర్స్ ఇండస్ట్రీ శృంగవరపుకోటలో చతికిలపడి చవకబారు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాను కొండ తవ్వి రూ.50 కోట్లతో కొత్తవలసలో ప్యాలెస్ కట్టానని అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. అది తన అత్తవారిచ్చిన స్థలంలో కట్టిన ఇల్లని చెప్పారు. రూ.20 కోట్లు ఇస్తే తన ఇల్లు రాసిచ్చేస్తానని చంద్రబాబుకు సవాల్‌చేశారు. రెల్లిలో 100 ఎకరాలున్నట్లు ఆరోపించారని, అక్కడ సెంటు భూమి కూడా లేదని స్పష్టంచేశారు. 40 ఏళ్ల చంద్రబాబు అనుభవం.. ఇక్కడ గల్లీ నాయకులు రాసిచ్చిన చీటీలు చదివే స్థాయికి దిగజారడం దౌర్భాగ్యమని దుయ్యబట్టారు. ఒక్కరూపాయి అవినీతి చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని ప్రకటించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, డిసిసిబి ఛైర్మన్ వేచలపు చినరామునాయుడు, కల్చరల్ అండ్ ఫోక్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, పోతనపల్లి వెంకటరావు, కృష్ణాపురం సర్పంచ్ యామిని దేవి, తదితరులు పాల్గొన్నారు.

జంఝావతి సాగునీటి కోసం 50ఏళ్ల నిరీక్షణ

అన్నదాత ఆశలు ఫలించేదెన్నటికి?
పాలకుల నిర్లక్ష్యం... రైతులకు శాపం
అర్ధాంతరంగా నిలిచిన కాలువ పనులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జంఝావతి రిజర్వాయర్ నుంచి సాగునీటి కోసం రైతులు 50ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. ప్రతి ఐదేళ్లకొకసారి ఎన్నికల ముందు రాజకీయ నాయకులు తియ్యటి మాటలు, అలవికాని వాగ్దానాలు పాలిస్తున్నారు కానీ జంఝావతి నది నుంచి చుక్క నీరు మండలానికి తీసుకు రాలేకపోతున్నారని తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా జంఝావతి సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదు.

పార్వతీపురం మండలానికి ఆనుకుని పక్కనే కొమరాడ మండలంలో గల ఈ జలాశయం ఎగువ కాలువ మండలంలో శివారు గ్రామమైన జమదాల వరకూ సుమారు 23కిలోమీటర్లు ఇప్పటికే తవ్వి ఉంచారు. అయితే ఈ కాలువ ద్వారా నీటిని తీసుకు రాగలిగితే పార్వతీపురం మండలంలో 12వేల ఎకరాలు, సీతానగరం

నిరుపయోగంగా ఉన్న ఎగువ కాలువ

తద్వారా ఈ ప్రాంతాలు సుభిక్షంగా మారుతాయి. అయితే ఈ కాలువలో నీరు ప్రవహించడానికి కొమరాడ మండలం డంగభద్ర దగ్గర కొండరాయి అడ్డగా ఉందని అధికారులు సాకు చూపుతున్నారు. దీన్ని పగుల గొట్టి నీటిని తరలించడానికి గత టిడిపి ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసినప్పటికీ ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంతో పనులు చేయకపోవడంతో సమస్య, సమస్యగానే నిలిచిపోయింది. దీంతో పార్వతీపురం, సీతానగరం మండలాల రైతులకు సాగునీరు కళగా మిగిలిపోయింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు సాగునీరందించే జంఝావతి, అడారు ప్రాజెక్టులపై అవగాహన పెంచుకుని, సరైన పరిష్కారం చూపించేందుకు ప్రయత్నించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం : బత్తిన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్రం, నియోజకవర్గ పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగాలంటే ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ పార్వతీపురం నియోజవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తిన మోహనరావు అన్నారు. ఆయన మంగళవారం ఎమ్మెల్యే అభ్యర్థిగా స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా స్థానిక పాత బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా భారీ ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని, ప్రజలంతా తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ప్రజలంతా గమనిస్తున్నారని, వైసిపి, టిడిపి, బిజెపి స్వార్థ రాజకీయాలకు, కుట్ర రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నాయన్నారు. ఇటువంటి రాజకీయాలకు ప్రజలు స్వస్తిపలికి ప్రజల మేలుకోరే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో పాలన మారాలి, మార్పు కావాలి అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చొక్కాపు వెంకటరమణ, తీళ్ల గౌరీశంకర్, పి.రవికుమార్, జక్కు ప్రవీణ్ కుమార్, సిపిఎం నాయకులు రెడ్డి శ్రీదేవి, బి.సూరిబాబు, ఎస్.ఉమామహేశ్వరరావు, సిపిఐ నాయకులు ఆర్‌విఎస్ కుమార్, టి.జీవ, జి.సూరయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు

ప్రజాశక్తి - సాలూరు

గర్భిణులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు అన్నారు. పాచిపెంట, సాలూరు, మక్కువ మండలాలకు చెందిన పిహెచ్‌సి వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ గర్భిణి నమోదు జరిగినప్పటి నుండి ప్రసవం జరిగేవరకు క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు నిర్వహించాలని, మొదటి త్రైమాసికంలోనే గర్భిణుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, తద్వారా హైరిస్క్ గర్భిణులకు త్వరగా గుర్తించ వచ్చని తెలిపారు. రక్త హీనత, హైరిస్క్ గర్భిణులను ఆసుపత్రులకు చేర్చేందుకు తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం వినియోగించాలని అందుకు 104 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని లేని యెడల 080 48641947 నంబర్‌కు ఫోన్ చేయాలని అన్నారు. ప్రిజం10 పక్కగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వేసవి రీత్యా వడదెబ్బ, డీ హైడ్రేషన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి, జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో డిఐఒ నారాయణరావు, డిప్యూటీ డిఎం హెచ్ఒ శివకుమార్, డిఎంఒ టి. జగన్ మోహనరావు, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్, ఎఫ్‌డిపి ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, ఎపిడిమియాలజిస్ట్ శ్రీధర్ పాల్గొన్నారు.

బి.పి.నాయుడుకు సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రిలో జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ప్రచారంలో భాగంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన కార్యదర్శి బిపి నాయుడుకు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బిపి నాయుడు మాట్లాడుతూ గ్రామంలో జనసేన, బిజెపి, టిడిపి నాయకులు సమన్వయంతో పనిచేసి ఎన్‌డిఎ కూటమి జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణను ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు.

ఐటిడిఎ పిఒ ఆకస్మిక బదిలీ

ప్రజాశక్తి - సీతంపేటపాలకొండ

స్థానిక ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, పాలకొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కల్పనా కుమారి ఆకస్మిక బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ బాధ్యతను జాయింట్ కలెక్టర్‌కు ఎస్ఎస్ శోబికకు అప్పగిస్తూ కల్పనాకుమారి ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జెసి శోబిక మంగళ వారం ఇన్చార్జి పిఒగానూ, ఆర్వోగా బాధ్యతలు స్వీకరిం చారు. కల్పనాకుమారి పిఒగా గతేడాది ఏప్రిల్ 12న పిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఏడాది పాటు డైనమిక్ పిఒగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని ఉద్యోగుల్లో చర్చ. ఇదిలా ఉండగా పాలకొండ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆమె సీతంపేట ఐటిడిఎ కార్యాలయంలో చేపట్టారు. నిబంధనల ప్రకారం నామినేషన్ దాఖలు, స్వీకరణ ప్రక్రియ నియోజకవర్గ కేంద్రంలో నే నిర్వహించాల్సి ఉంది. కానీ ఆర్వోగా వ్యవహరిస్తున్న కల్పనా కుమారి ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయం లో నిర్వహించడంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఎన్నికలకు సంబంధించి కింద స్థాయి అధికారులు నింపిన ఫార్మాట్‌లను తప్పుడు సమాచారంతో ఉన్నతాధికారు లకు నివేదించడం కూడా ఆమె బదిలీకి కారణమని సమాచారం.

కొత్త పిఒగా బన్సాల్

స్థానిక ఐటిడిఎ ప్రాజెక్టు అధికారిగా శుభమ్ బన్సాల్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు మరోసారి రాజన్నదొర నామినేషన్

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సీఎం రాజన్నదొర బుధవారం మరోసారి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసిన రాజన్నదొర ఈనెల 24న భారీ ర్యాలీతో మరోసారి నామినేషన్ వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పదివేల మంది పైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీ చేపట్టనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలో ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ నిర్వహించనున్నారు.

25న సంధ్యారాణి నామినేషన్

ఈనెల 25న టిడిపి అభ్యర్థి సంధ్యారాణి మరోసారి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆమె మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేశారు. గురువారం టిడిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులతో కలిసి ర్యాలీ నిర్వహించి పార్టీ బలనిరూపణ చేయాలని భావిస్తున్నారు.

ఇద్దరు ఇండిపెండెంట్ల నామినేషన్లు

నామినేషన్ ప్రక్రియలో భాగంగా మంగళవారం ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఆర్వో విష్ణు చరణ్ కి అందజేశారు. వీరిలో కంచారి బంగారాజు, కెల్ల మురళి ఉన్నారు.

ప్రజాసమస్యలే సిపిఎం ఎన్నికల అజెండా

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలే సిపిఎం ఎన్నికల అజెండా అని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని చినబజార్ లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సిపిఎం ఎన్నికల ప్రణాళికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రణాళికని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కోరారు. ఎపికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని ద్రోహం చేశాయని చెప్పారు. విభజన హామీలను పూర్తిగా గాలికొదిలేశాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం సభ్యులు కేశవ, చిన్న పాల్గొన్నారు.

వృద్ధ కళాకారుడికి 99వ సారి సన్మానం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని తుమారాడకు చెందిన చాకరాపల్లి ఈశ్వరరావుకు శ్రీ భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల సిబ్బంది సమక్షంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు జగన్మోహన్‌రావు మాట్లాడుతూ సుమారు 2500 ప్రదర్శనలు ఇచ్చి 99 సన్మానాలు అందుకొని వృద్ధాప్యంలో కూడా తన వృత్తికి న్యాయం చేస్తున్న ఈశ్వరరావును అభినందించారు. తన గానంతో ఇటు పిల్లలను, ఉపాధ్యాయులను, ప్రజలను మైమరిపించేలా పాడుతారన్నారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుశాంత్ మాట్లాడుతూ భూతాపాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణ సహజ వనరుల వినియోగం పట్ల అవగాహన కలిగి ఉండి ఈ భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని తెలిపారు. ప్రధానంగా ఉపరితల ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, అడవులు రోజురోజుకీ క్షీణిస్తున్నాయని, అడవుల క్షీణతవల్ల భూతాపం పెరిగి ప్రపంచ మానవాళికి విపత్కర పరిస్థితిలో ఏర్పడుతున్నాయని తెలియజేస్తూ వీటిని ఎదుర్కోవాలంటే పచ్చదనాన్ని పెరిగించాలని సూచించారు. కావున ప్రతి ఒక్కరూ చెట్లను నాటి పచ్చదనాన్ని పెంచాలని, సామాజిక వనాలను అభివృద్ధి బాధ్యతగా తీసుకొని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వి.ప్రభాకర్, ఐక్య సి కోఆర్డినేటర్ రవి కిరణ్ కుమార్, జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ ఫణికుమారి, అధ్యాపకులు మంజుల, టి.లలిత కుమారి, బి.నరేష్, తమ్మయ్య, రమేష్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంఛార్జి గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

కంబరవలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరవలసలో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఎం.సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పి జి.అనూష, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న డిఎం మహేంద్రకుమార్

ఇక ఆన్‌లైన్‌లోనే జిసిసి లావాదేవీలు : డిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక జిసిసి బ్రాంచ్ పరిధిలో పనిచేస్తున్న డిఆర్ డిపోలు, గోదాములు, గ్యాస్, పెట్రోల్ అమ్మకాలు, ఎంఎఫ్‌పి గోదాం, డిఆర్‌లు మే నుంచి ఆన్లైన్ విధానంలో ఇకపై చేయాల్సి ఉంటుందని పార్వతీపురం జిసిసి డిఎం మహేంద్ర కుమార్ తెలిపారు. గుమ్మలక్ష్మీపురం జిసిసి బ్రాంచ్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆన్లైన్ విధానంపై సిబ్బందికి శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆన్లైన్ విధానంతో ఎటువంటి లోటు పాట్లు లేకుండా ఉంటాయని చెప్పారు. జిసిసి కొనుగోలు, అమ్మకాలు లక్ష్యాలను పూర్తిచేసే దిశగా ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. అనంతరం గ్యాస్ గోదాం, పెట్రోల్ బంక్ పరిశీలించారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ నియోజకవర్గంలో పలు మండలాల నుండి వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలోకి చేరికల జోరు కొనసాగు తుంది. గత రెండు రోజులుగా బలిజిపేట మండలం చిలకలపల్లి, సీతానగరం మండలం ఏగోటి వలస, లక్ష్మీపురం, పార్వతీపురం మండలం పెదబొండపల్లి, సూడిగం, లక్ష్మీనారాయణ పురం, తెలు నాయుడు వలస, డోకిశల గ్రామాల నుండి తటస్థంగా ఉన్న నాయకులు టిడిపిలోకి చేరుతున్నారు. ఈ పరిణామంతో టిడిపి అభ్యర్థి బోనెల విజయ్ చంద్రతో పాటుగా నాయకులు, కార్యకర్తల్లో కూడా ఉత్సాహాన్ని నింపుతుంది.

ఘనసరలో 11 మంది వాలంటీర్ల రాజీనామా

భామిని: మండలంలోని ఘనసార సచివాలయం పరిధిలో 11 గ్రామ వాలంటీర్లు తమ విధులకు రాజీనామా చేశారు. 11 మంది రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. కార్యక్రమంలో ఘనసార సర్పంచ్ ప్రతినిధి కిల్లారి పొల్లుణరావు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 13వ వార్డులో గల ఇందిరా కాలనీలో గలబోరు మరమ్మతులకు గురై ఆరు నెలలైనా సంబంధిత మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఆ వార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోరును బాగు చేయాలని కోరినా మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు గానీ, వార్డు సచివాలయ ఎమినిటి సెక్రటరీలు గానీ చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. వేసవి దృష్ట్యా తక్షణమే బోరుకు మరమ్మతు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు